

కేసులపై సత్వరమే స్పందించండి

కేసులపై సత్వరమే స్పందించాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు తెలిపారు. శనివారం ఆయన రామసముద్రం పోలీస్‌స్టేషన్ తనిఖీ చేశారు. -8లో



ఎస్‌జీఎఫ్ పోటీల సందడి

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఫుట్ బాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. కరోనాతో నిలిచిపోయిన పోటీలు తిరిగి జరుగుతుండటంతో సందడి నెలకొంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.86	రూ.110
రెండోరకం	రూ.50	రూ.82

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 359 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	515	515
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 287.760 కిలోలు

న్యూస్‌రీల్

18 నుంచి బీహెచ్‌ఈఎల్‌కు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: దసరా సెలవులను పురస్కరించుకుని మదనపల్లె నుంచి బీహెచ్‌ఈఎల్‌కు ప్రత్యేక స్పెషల్ బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ-2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు అల్ట్రాడీలక్స్ స్పెషల్ బస్సులు తిరుగుతాయని చెప్పారు. అలాగే బీహెచ్‌ఈఎల్ నుంచి మదనపల్లెకు కూడా బస్సులు నడుపుతామన్నారు. టిక్కెట్టు రూ.925 చెల్లించాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

8 నుంచి వైవీయూలో ధ్రువపత్రాల పరిశీలన



ఏపీజే అబ్దుల్ కలాం కేంద్ర గ్రంథాలయం

వైవీయూ: ఏపీ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో వైవీయూలో పీజీ ప్రవేశాల ప్రక్రియ ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకులు ఆచార్య కంకణాల గంగయ్య తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఏపీ పీజీసెట్-23లో ర్యాంకు పొంది, వైవీయూలో పీజీ సీటు లభించిన విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు పరిశీలిస్తామని, అనంతరం ఫీజు చెల్లింపు ప్రక్రియ పూర్తిచేస్తామని తెలిపారు. పీజీ సీటు పొందిన విద్యార్థులందరూ వైవీయూలోని ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయం ప్రాంగణంలో ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

డ్రోన్ టెక్నాలజీపై అవగాహన



డ్రోన్‌పై శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

పులివెందుల రూరల్: వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణంలోని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో యంత్రా 2కె23 సదస్సులో భాగంగా శనివారం డ్రోన్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సదస్సుకు వివిధ జిల్లాల నుంచి సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మెకానికల్ విభాగాధిపతి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ అవగాహన సదస్సుల్లో డ్రోన్ ఏవిధంగా ఉపయోగించాలనే అంశంపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కష్టపడితేనే తగిన గుర్తింపు వస్తుందన్నారు. జాతీయస్థాయిలో యంత్ర 2కె 23 సదస్సు పులివెందుల జేఎన్టీయూలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

లయోలా విద్యార్థి భళా



ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న ముస్తాఖీం పటాన్

పులివెందుల టౌన్: స్థానిక లయోలా (వైఎస్‌ఆర్‌ఆర్) పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన ముస్తాఖీం పటాన్ రాష్ట్ర స్థాయిలో మూడు విభాగాల్లో రాణించి భళా అనిపించారు. విజయవాడలోని ఆంధ్రా లయోలా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీలో ఈసీఈ విభాగంలో జరిగిన ప్రాజెక్టు ఎక్స్‌పోలోనూ, సీఎస్‌ఈ విభాగంలో జరిగిన టెక్నికల్ క్విజ్‌లోనూ ప్రథమ స్థానం సాధించారు. సీఎస్‌ఈ విభాగంలో జరిగిన ప్రాజెక్టు ఎక్స్‌పోలో ద్వితీయ బహుమతి గెలుచుకుని సత్తా చాటారు. తమ కళాశాల విద్యార్థి రాష్ట్రస్థాయిలో సత్తా చాటడంతో ప్రిన్సిపల్ బ్రిట్టో ప్రత్యేకంగా అభినందించారు.

ఉపాధి ఊతం.. ఉద్యానం ఘనం

మామిడి తోటతో ఆదాయం



ఈయన పేరు దుగ్గల పుల్లారెడ్డి. ఒంటిమిట్ట మండలం రాచగుడిపల్లె గ్రామ రైతు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు ఉంది. సుస్థిర ఆదాయ మార్గాల ద్వారా జీవనోపాధి పొందేందుకు పండ్లతోటల పెంపకానికి శ్రీకారం చుట్టారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మామిడి తోట ఏర్పాటు చేసేందుకు ఉపాధి హామీ పథకం కింద రూ.1,57,342 అవుతుందని అంచనా వేశారు. ఈ మొత్తానికి 323 పనిదినాలకు సాంకేతిక ఆమోదం, పరిపాలనా అనుమతి లభించింది. మూడేళ్ల తర్వాత మామిడి తోటలో నిరంతర ఆదాయంతో పాటు దీర్ఘకాలిక జీవనోపాధికి మార్గం ఏర్పడిందని రైతు పుల్లారెడ్డి చెబుతున్నారు. పైగా తన భూమికి విలువ పెరిగిందన్నారు.

చెట్టుకు 100 కాయలు



పచ్చగా కళకళలాడుతున్న పొలంలో ఉన్న ఈ రైతు పేరు కె.వెంకటసుబ్బయ్య. ఈయనది ఒంటిమిట్ట మండలం రాచగుడిపల్లె. వ్యవసాయ పంటల సాగులో అలసిపోయిన ఆయన పంట మార్పిడికి శ్రీకారం చుట్టారు. సాగునీటి సమస్య అధిగమించేందుకు బిందు సేద్యం ఎంచుకున్నారు. అంతర పంటలు సాగు చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వ సాయంతో బత్తాయి తోట ఏర్పాటు చేసుకున్నారు. తొలి కాపులోనే గణనీయమైన ఆదాయం గడించారు. ఒక్కొక్క చెట్టుకు 70 నుండి 100 కాయల కాపు వచ్చింది. దీర్ఘకాలిక ఆదాయ వనరులైన పండ్లతోటల ఏర్పాటుతో ఎంతో ఉపయోగకరంగా మారింది.



సాగులో ఉన్న డ్రాగన్ పంట

వ్యవసాయ పంటలు కలిసిరాక, కష్టాల సాగులో కొట్టుమిట్టాడుతున్న రైతన్నలకు ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం ఊతంగా నిలుస్తోంది. అదనపు ఆదాయ ఫలం చేతికందేలా రాయితీపై ఉపాధి పథకం కింద నిధులు కేటాయిస్తోంది. సన్న, చిన్నకారు రైతులకు మరింత వెన్ను దన్నుగా నిలిచేందుకు మొక్కలు, నిర్వహణ ఖర్చులు, ఎరువులు అందిస్తోంది. ఆసక్తి, అర్హులైన రైతులకు బిందు సేద్యం పరికరాలతో చేయూతనిస్తోంది. జిల్లాలో పండ్ల తోటల సాగును ప్రోత్సహిస్తోంది. ఫలితంగా రైతుల వ్యవసాయ పొలాలు ఉద్యాన పంటలతో కళకళలాడుతోన్నాయి.

- ఉద్యాన పంటల సాగుకు అన్నదాతల మొగ్గు
- జాబ్ కార్డు ద్వారా రైతుకు వంద రోజుల పని దినాలు
- ఫలసాయంతో మెరుగవుతున్న జీవన ప్రమాణాలు

సాక్షి ప్రతినిధి, కడప: రైతులు మూస పద్ధతిలో వ్యవసాయ పంటలు సాగుచేయకుండా, నిత్య విద్యార్థిలా మారితే వ్యవసాయం పండుగగా మారుతుందని నిపుణులు వివరిస్తున్నారు. సన్న, చిన్నకారు రైతులు ఉద్యాన పంటలు ఏర్పాటు చేసుకొనేందుకు ఉపాధి హామీ పథకం అండగా నిలుస్తోంది. ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకొని ముందడుగు వేస్తున్న రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. 2022-23 ఆర్థిక సంత్సరానికి జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద 125 మంది రైతులు 322 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 231 మంది రైతులు 592 ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేశారు. వ్యవసాయ పంటలకంటే ఉద్యాన పంటల్లో సాగు యాజమాన్య ఖర్చు తక్కువ కావడంతో వంద శాతం ఈ పథకం రైతులకు ఆసక్తిగా నిలుస్తోంది.



లాభసాటిగా ఉద్యాన పంటలు

వరి, పసుపు, చెరకు లాంటి పంటలను సాగు చేస్తుండడంతో నీటి వినియోగం ఎక్కువగా ఉంటోంది. ఆరుతడి పంటల సాగుతో నీరు సద్వినియోగం కావడమే కాకుండా, పంటలు ఏపుగా రానున్నట్లు నిపుణులు వివరిస్తున్నారు. ఉపాధి హామీ పథకం అనుసంధానంతో ఉద్యాన పంటలు లాభసాటిగా నిలుస్తున్నాయి. నర్సరీ నుంచి పంట సాగు, డ్రిప్ వరకూ సాయం అందిస్తూ ఉపాధి హామీ పథకం అన్నదాతలకు దన్నుగా నిలుస్తోంది. బత్తాయి, మామిడి లాంటి దీర్ఘకాలిక ఫలసాయం సాధించే పంటలు సాగు చేయడంతో వారికి లాభసాటిగా నిలుస్తున్నాయి. ఎప్పుడూ నష్టాలు చవి చూసే రైతన్నలు మెరుగైన యాజమాన్య పద్ధతుల ద్వారా గణనీయంగా లాభాలు గడిస్తున్నారని నిపుణులు చెబుతున్నారు.

డ్రాగన్ ఫ్రూట్‌తో లాభాలు



ఉపాధి హామీ పథకం ద్వారా లభిస్తున్న ప్రోత్సాహాన్ని తెలుసుకొని అర ఎకరం పొలంలో డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు పెంచుకున్నా. మొక్క నాటేందుకు అవసరమైన సామాగ్రి ఏర్పాటు నిమిత్తం ఉపాధి హామీ పథకం కింద రూ.1.86 లక్షల ఆర్థికసాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. కంటికి రెప్పలా పంటను కాపాడుకున్న నాకు తొలి సంవత్సరంలోనే 700 కిలోల డ్రాగన్ ఫ్రూట్ ఫలసాయం లభించింది. ఈ పండుతో ఆరోగ్యంగా ఉంటారని తెలియడంతో మార్కెట్‌లోనూ కొంత డిమాండ్ ఏర్పడింది. 2021 నుంచి పంట లాభాలు దక్కడంతో గణనీయమైన ఆదాయం లభిస్తోంది.

-ఎం సుబ్బయ్య, యువ రైతు, దిరసవంచ గ్రామం, బి.మఠం మండలం

విద్య, క్రీడలకు అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి
- వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



పోటీ పడుతున్న వాలీబాల్ జట్లు

మైదుకూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతోపాటు క్రీడలకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జిల్లా మైదుకూరు మేధా డిఫెన్స్ అకాడమీ మైదానంలో రాష్ట్ర స్థాయి అండర్-17 వాలీబాల్ టోర్నమెంట్‌ను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ.రామచంద్రారెడ్డితో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. 13 జిల్లాల వాలీబాల్ జట్లు పాల్గొన్నాయి. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నవంబర్‌లో శ్రీనగర్‌లో జరిగే జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికై క్రీడా కారులు ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.ఎంవీ.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కార్పొరేట్ సంస్థలకు దీటుగా విద్యారంగాన్ని తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్ ఈ నాలుగున్నరేళ్లలో రూ.53 వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి రాజు మాట్లాడుతూ అంతర్ జిల్లాల వాలీబాల్ టోర్నమెంట్‌ను మైదుకూరులో నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతించిందని, ఇక్కడే బాలురు, బాలికల రాష్ట్ర జట్లను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

హోరాహోరీగా పోటీలు

వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. తొలిరోజున బాలుర విభాగంలో జరిగిన పోటీల్లో తూర్పుగోదావరి జట్టు కృష్ణపై, విజయనగరం జట్టు విశాఖపట్నంపై, నెల్లూరు జట్టు కడపపై, ప్రకాశం జట్టు గుంటూరుపై, అనంతపురం జట్టు చిత్తూరుపై గెలుపొందాయి. బాలికల విభాగంలో పశ్చిమ గోదావరి జట్టుపై కర్నూలు, చిత్తూరు జట్టుపై ప్రకాశం, నెల్లూరు జట్టుపై కడప, కృష్ణ జట్టుపై శ్రీకాకుళం, తూరు గోదావరి జట్టుపై అనంతపురం, శ్రీకాకుళం జట్టుపై విశాఖపట్నం, గెలుపొందాయి. ఈ పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు వచ్చారు. రెఫరీలుగా వ్యవహరించారు.

జిల్లాను అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

- కలెక్టర్ గిరీషా, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి
- రూ.1.53 కోట్లతో నిర్మించిన మున్సిపల్ పార్కు ప్రారంభం

రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అగ్రగామిగా తీర్చిదిద్దుతామని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం రాయచోటి మున్సిపల్ పరిధిలో కె.రామాపురం డైట్ హాస్టల్ ప్రాంగణంలో రూ.1.53 కోట్లతో ఏర్పాటు చేసిన మునిసిపల్ పార్కును వారు ప్రారంభించారు. ఇందులో జిమ్, యోగ సెంటర్లు, 500 మీటర్ల వాకింగ్ ట్రాక్, విద్యుత్ ఎల్ఈడీ లైట్లను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషాలు ప్రారంభించారు. ఆహ్లాదకరంగా పార్కు ఏర్పాటు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పార్కులోని మెడిటేషన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన వేదికపై నుంచి కలెక్టర్ మాట్లాడుతూ రాయచోటి జిల్లా కేంద్రంగా ఏర్పడ్డాక అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోందన్నారు. పార్కును ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

- ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మరిన్ని పార్కులు, నగరవనం, శిల్పారామం, క్రికెట్ స్టేడియం, ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్, కలెక్టర్, జేసీ, డీఆర్‌ఓ, ఎస్పీ బంగ్లాల వంటివి శరవేగంగా నిర్మాణం జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో రాయచోటి పట్టణాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. విశాల వాతావరణంలో ఏర్పాటు చేసిన పార్కును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ గంగాప్రసాద్, కౌన్సిలర్లు కోఆప్షన్ మెంబర్లు, ప్రముఖ నాయకులు, మునిసిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ప్రణాళికబద్ధంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డిలు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాయచోటి పట్టణ పరిధిలోని నక్కలవాండ్లపల్లి వద్ద 32.62 ఎకరాల విస్తీర్ణంలో



పార్కులో ఏర్పాటు చేసిన పరికరాలపై ఎక్సర్‌సైజు చేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం నిర్మాణాలు, మాసాపేట శెట్టివాండ్లపల్లి వద్ద 40 ఎకరాల విస్తీర్ణం 2.25 చదరపు అడుగులలో నిర్మాణం చేయనున్న ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్, కలెక్టర్ వెనుకవైపున నిర్మించ తలపెట్టిన కలెక్టర్, జేసీ, డీఆర్‌ఓ బంగ్లాల ప్రదేశాలలో కలెక్టర్, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పరిశీలించారు. మొదట క్రికెట్ స్టేడియం ల్యాండ్ స్కేపింగ్ పనులు, భవనాలు, రోడ్డు నిర్మాణం, స్టేడియం సరిహద్దుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు పనులను పరిశీలించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలు గురికాకుండా రక్షణ ఏర్పాటు చేయాలని రాయచోటి తహసీల్దార్‌ను ఆదేశించారు. అలాగే క్రికెట్ స్టేడియం అభివృద్ధి వేగవంతం చేయాలని సూచించారు. స్టేడియం రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలన్నారు. మాసాపేట శెట్టివాండ్లపల్లి వద్ద 40 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టనున్న ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణ ప్రాంతాన్ని, మ్యాపులను పరిశీలించారు. ప్రధాన రోడ్డు నుంచి ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ వరకు ఎగుడు దిగుడుగా ఉన్న ప్రాంతాన్ని చదును చేసి 100 అడుగుల రోడ్డును, అదే ప్రాంతంలో 15 ఎకరాల్లో ఎస్పీ కార్యాలయం కూడా నిర్మించనున్నట్లు చెప్పారు. నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లా రాయచోటి కేంద్రంలో చేపట్టిన పనులకు నిధుల పరంగా ఏదైనా సమస్య ఉంటే ప్రభుత్వంతో మాట్లాడి మంజూరు చేసేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, మున్సిపల్ చైర్మన్ ఫజాయ్ బాష, ఆర్‌అండ్‌బీ జిల్లా అధికారి సహదేవరెడ్డి, మున్సిపల్ కమీషనర్ గంగప్రసాద్, తహశీల్దార్ హేమంతకుమార్, రెవెన్యూ, ఆర్ అండ్‌బి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాబ్‌లు వచ్చేశాయ్

- 8వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు పంపిణీ
- విద్యలో సాంకేతికీకరణకు పెద్ద పీట

మదనపల్లె సిటీ: ప్రభుత్వ బడుల్లో విద్యను సాంకేతికీకరణ బాట పట్టించడానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. విద్యార్థులకు ట్యాబ్‌లను అందిస్తూ దీర్ఘకాల ప్రయోజనాలకు పెద్దపీట వేసింది. ఇప్పటికే గత ఏడాది ఎనిమిదో తరగతి విద్యార్థులకు విలువైన బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ఉచితంగా అందించిన జగన్ సర్కారు ఈ ఏడాది 2023-24 విద్యా సంవత్సరానికి ఎనిమిదో తరగతి చదువుతున్న 25,449 మందికి ఇవ్వనుంది. వీటి ద్వారా వారి అభ్యసన సామర్థ్యాలను మరింత మెరుగు పడేలా చర్యలు తీసుకుంటోంది.

- దశాబ్దం క్రితమే కార్పొరేట్ విద్యారంగం టెక్నో, ఈ-టెక్నో, స్మార్ట్ వంటి పదాలతో తమ సంస్థల్లో విద్యార్థులకు సాంకేతిక విద్య అందిస్తున్నట్లు ప్రచారం చేసుకుని ఆ మేరకు విద్యార్థుల తల్లిదండ్రులను విశేషంగా ఆకర్షించాయి. అయినప్పటికీ అప్పటి ప్రభుత్వాలు సాంకేతికతకు ప్రభుత్వ బడుల్లో పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు సాంకేతికంగా బాగా వెనుకబడటం తెలిసిందే. ఇటువంటి తరుణంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కింద స్థాయి నుంచే సాంకేతికతకు అలవాటుపడేలా పరికరాలను అందిస్తూ ప్రోత్సహిస్తోంది. భవిష్యత్తులో తన ఉనికిని చాటాలే బీజాలు వేస్తోంది.

ఇప్పటికే డిజిటల్ బోధన

ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే డిజిటల్ తరగతులను ప్రభుత్వం నిర్వహిస్తోంది. విద్యలో సాంకేతికీకరణను ప్రవేశపెట్టడంలో భాగంగా స్మార్ట్ టీవీ ద్వారా బోధన, ఇంటరాక్టివ్ ప్యానెల్స్ ద్వారా బోధన, డిజిటల్ క్లాస్‌రూములు, వర్చువల్ క్లాస్ రూములు, పెర్‌ఫెక్టివ్ అడాప్టివ్ లెర్నింగ్ ట్యాబ్‌లు ఇలా ఇక్కొక్కటిగా సాంకేతికతను జొప్పిస్తూ విద్యలో విప్లవాత్మక మార్పులు



ట్యాబ్ ద్వారా బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు



ట్యాబ్‌తో విద్యార్థిని

ప్రవేశపెట్టింది. ఈ విధానంలో విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభ్యసనా సామర్థ్యాలు మెరుగుపడటమే కాక భవిష్యత్తులో దేశ,విదేశాల్లో బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు పొందేందుకు దోహదపడుతుంది.


విద్యార్థుల్లో నూతనోత్సాహం

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిని మించి సాంకేతికతను వినియోగిస్తున్న ప్రభుత్వం గత ఏడాది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసింది. వీటి ద్వారా విఖ్యాతి చెందిన బైజూస్ కంటెంట్‌ను చేరువ చేసి డిజిటల్ బోధనలో మరో అడుగు ముందుకు వేసింది. చిన్న వయస్సు నుంచే ట్యాబ్‌లను వినియోగించి చదువుకోవడం వారిలో నూతన ఉత్సాహం నింపుతోంది.

రెండో ఏడాది కూడా పంపిణీకి కసరత్తు

గత ఏడాది నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేయడం ప్రారంభించిన ప్రభుత్వం వరుసగా రెండో ఏడాది కూడా అందించేదుకు కసరత్తు ప్రారంభించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ద్వారా జిల్లా విద్యాశాఖ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న వారి సంఖ్యను తేల్చపనిలో పడ్డారు.ఈ ఏడాది 25,449 మంది విద్యార్థులు, 1650 మంది ఉపాధ్యాయులకు వీటిని ఇవ్వనున్నారు.

8వ తరగతి విద్యార్థులందరికీ ఇస్తాం



జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాం. ప్రస్తుతం విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు సేకరించాం. ప్రపంచ స్థాయిలో అభ్యసనకు ట్యాబ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇకపై వీటిలోనే పరీక్షలు రాసేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలి. ఇంట్లో ట్యాబ్‌లను వినియోగిస్తున్నప్పుడు తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. ట్యాబ్‌లో సాంకేతిక సమస్య తలెత్తితే సమీప సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ద్వారా పరిష్కరించేలా హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని ఆదేశించాం.

-శ్రీరాం పురుషోత్తం, జిల్లా విద్యాశాఖాధికారి, రాయచోటి

14న పుష్పగిరిలో సామూహిక పిండ ప్రదానం

వల్లూరు : పుష్పగిరి కొండపైన గల శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ సమీపంలో పవిత్ర పెన్నా నది ఒడ్డున గల రుద్ర పాద ఆలయం వద్ద ఈ నెల 14న పితృ దేవతలకు అత్యంత ప్రీతికరమైన మహాలయ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని పుష్పగిరి శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక పిండ ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం వుంటుందని తెలిపారు. కుల, మతాలతో సంబంధం లేకుండా ఎవరైనా తమ పితృదేవతలతోపాటు పరమపదించిన వారికి పిండ ప్రదానం చేయవచ్చునని వివరించారు.

ఇండియన్ బ్యాంక్ Indian Bank
కకూన్ మార్కెట్ బ్రాంచ్
సుమ కాంప్లెక్స్, పటేల్ రోడ్డు, మదనపల్లి, అన్నమయ్య జిల్లా, ఆం.ప్ర.-517325. ఫోన్ : 08571-223341

స్వాధీనత ప్రకటన APPENDIX - IV (Rule-8(1)) (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002, సెక్షన్ 13(12)లోని 8వ మరియు 9వ నిబంధనలను అనుసరించి ఇండియన్ బ్యాంక్‌కు సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ

ఋణగ్రహీతలు : 1) శ్రీ ఎస్.నాగరాజా, తండ్రి : సుబ్బారాయుడు, డి.నెం.3-146-14-12-30, పీవర్స్ కాలనీ, చీకలుగుట్ట (గొల్లపల్లి బైపాస్ రోడ్డు వద్ద గల సబ్ స్టేషన్ తూర్పు వైపున), మదనపల్లి, అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్-517325. **2) శ్రీ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, తండ్రి : నరసింహా రెడ్డి,** డి.నెం.15-1-9-2బి, శివాజీ నగర్, మదనపల్లి, అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్ -517325.

వారు నోటీసు ప్రకారం చెల్లించవలసిన బకాయి సొమ్ము **తేది.01-07-2023** నాటికి **SOD ఖాతా నెం.991477246** లోని **రూ.10,54,368/-** (అక్షరాలా పది లక్షల యాభై నాలుగు వేల మూడు వందల అరవై ఎనిమిది రూపాయలు మాత్రమే) మరియు **GECL లోన్ ఖాతా నెం. 6891636344** లోని **రూ.89,104/-** (అక్షరాలా ఎనభై తొమ్మిది వేల నూట నాలుగు రూపాయలు మాత్రమే) మరియు **తేది.01-07-2023** నుండి జమకూడు తదుపరి వడ్డీ ఈ నోటీసు అందిన 60 రోజులలోగా **ఇండియన్ బ్యాంక్** వారికి చెల్లించవలసినదిగా **తేది.01-07-2023**న ఋణగ్రహీతలకు డిమాండ్ నోటీసు జారీ చేయబడినది.

బకాయిసొమ్ము చెల్లించుటలో ఋణగ్రహీతలు/సహ-ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు చట్టం సెక్షన్ 13(4)తో పాటు రూలు 8 మరియు 9 క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ పేర్కొన్న ఆస్తిని **తేది.05-10-2023** న స్వాధీనతలోనికి తీసుకోవడమైనదని ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఋణగ్రహీతకి సంబంధించి సదరు ఆస్తిపై ఎటువంటి లావాదేవీలు జరుపరాదనీ, ఎటువంటి లావాదేవీలైనా **తేది.05-10-2023** నాటికి **SOD ఖాతా నెం.991477246** లోని **రూ.10,75,637/-** (అక్షరాలా పది లక్షల డెబ్బై ఐదు వేల ఆరు వందల ముప్పై ఏడు రూపాయలు మాత్రమే) మరియు **GECL లోన్ ఖాతా నెం.6891636344** లోని **రూ.91,482/-** (అక్షరాలా తొంభై ఒక్క వేల నాలుగు వందల ఎనభై రెండు రూపాయలు మాత్రమే) మరియు వడ్డీ మరియు ఇతర ఖర్చులు **ఇండియన్ బ్యాంక్** వారి ఛార్జీకి లోబడి ఉంటాయని ఇందుమూలముగా ముఖ్యముగా ఋణగ్రహీతకు మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించడమైనది.

ఋణగ్రహీత'లు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించగలరు.

ఆస్తి షెడ్యూలు

తనఖా ఆస్తులు : శ్రీ ఎస్.నాగరాజా గారి ఆస్తుల యొక్క వివరములు / వివరాలు

ఆస్తి వివరములు : ఐటమ్ 1 : చిత్తూరు జిల్లా, మదనపల్లి సబ్ జిల్లా, మదనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని, బండమీద కమ్మపల్లి రెవెన్యూ గ్రామం, సర్వే నెం.లు 104-3హెచ్, 104-3ఐ, 104-3జె, 104-3కె, 104-3ఎల్2, 104-3ఎక్స్1, 105-2బి మరియు 105-3బి, 3వ వార్డు, చీకులగుట్ట, పీవర్స్ కాలనీ, డి.నెం.3-146-14-12-30 భాగం తో గల రేకుల ఇల్లు మొత్తం విస్తీర్ణం 58.66 చ.గ.లు స్థలము పూర్తిగా.

హద్దులు : తూర్పు : ఎస్.నాగరాజా గారి ఇల్లు, **పడమర :** ఎస్.నాగరాజా గారి ఇల్లు, **ఉత్తరం :** పురం సహదేవ గారి ఇల్లు, **దక్షిణం :** నూలు బాలకృష్ణ గారి ఇల్లు.

పై హద్దుల మధ్య తూర్పు నుండి పడమర ఇరువైపులా 24 అడుగులు లేదా 7.32 మీటర్లు మరియు ఉత్తరం నుండి దక్షిణం వైపు ఇరు వైపులా 22 అడుగులు లేదా 6.71 మీటర్లు లేదా దానికి సమానమైన 58.66 చ.గ.లు ఖాళీ స్థలము లో నిర్మించిన రేకుల భవనము తూర్పు నుండి పడమర 22 అడుగులు మరియు ఉత్తరం నుండి దక్షిణం ఇరు వైపులా 22 అడుగులు లేదా దానికి సమానమైన 484 చ.అ.లు. అందలి తలుపులు, కిటికీలు మరియు వాటి ఫ్రేములు, ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్లు మరియు సర్వీసులు, మున్సిపల్ టాప్ / బోరు, స్టెయిర్ కేస్ అందలి రూఫ్ మరియు అడుగునివేశములు మొదలగునవి అన్ని యీజిమెంటరీ హక్కులతో సహా.

ఐటమ్ 2 : చిత్తూరు జిల్లా, మదనపల్లి సబ్ జిల్లా, మదనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని, బండమీద కమ్మపల్లి రెవెన్యూ గ్రామం, సర్వే నెం.లు 104-3హెచ్, 104-3ఐ, 104-3జె, 104-3కె, 104-3ఎల్2, 104-3ఎక్స్1, 105-2బి మరియు 105-3బి, 3వ వార్డు, చీకులగుట్ట, పీవర్స్ కాలనీ, డి.నెం.3-146-14-12-30 భాగం తో గల రేకుల ఇల్లు మొత్తం విస్తీర్ణం 122.22 చ.గ.లు స్థలము పూర్తిగా.

హద్దులు : తూర్పు : ఎస్.నాగరాజా గారి ఇల్లు, **పడమర :** రోడ్డు, **ఉత్తరం :** పురం సహదేవ గారి ఇల్లు, **దక్షిణం :** నూలు బాలకృష్ణ గారి ఇల్లు.

పై హద్దుల మధ్య తూర్పు నుండి పడమర ఇరువైపులా 50 అడుగులు లేదా 15.25 మీటర్లు మరియు ఉత్తరం నుండి దక్షిణం వైపు ఇరు వైపులా 22 అడుగులు లేదా 6.71 మీటర్లు లేదా దానికి సమానమైన 122.22 చ.గ.లు ఖాళీ స్థలములో నిర్మించిన ఆర్‌సిసి రూఫ్ క్రింది మరియు మొదటి అంతస్థులు తో గలది. క్రింది అంతస్థు నందలి తూర్పు నుండి పడమర 37.5 అడుగులు మరియు ఉత్తరం నుండి దక్షిణం ఇరు వైపులా 17.5 అడుగులు లేదా దానికి సమానమైన 656.25 చ.అ.లు. మరియు మొదటి అంతస్థు నందు నిర్మించిన తూర్పు నుండి పడమర 11.752 అడుగులు మరియు ఉత్తరం నుండి దక్షిణం ఇరు వైపులా 17.5 అడుగులు లేదా దినకి సమానమైన 206 చ.అడుగులు అందలి తలుపులు, కిటికీలు మరియు వాటి ఫ్రేములు, ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్లు మరియు సర్వీసులు, హెచ్‌యస్‌సి నెం.25191, మున్సిపల్ టాప్ / బోరు, స్టెయిర్ కేస్ అందలి రూఫ్ మరియు అడుగునివేశములు మొదలగునవి అన్ని యీజిమెంటరీ హక్కులతో సహా.

తేది : 05-10-2023
ప్రదేశం : మదనపల్లి

సం/-అధీకృత అధికారి & చీఫ్ మేనేజర్
ఇండియన్ బ్యాంక్, మదనపల్లి

మదనపల్లెలో ఎస్‌జీఎఫ్ పోటీల సందడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న క్రీడాకారులు

- అంతర జిల్లాల ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం
- ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అంతర జిల్లాల ఫుట్‌బాల్ పోటీలకు మదనపల్లె జెడ్పీహైస్కూల్ వేదికైంది. కరోనాతో మూడేళ్ల పాటు నిలిచిపోయిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు తిరిగి ప్రారంభమవడంతో సందడి నెలకొంది. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన ఫుట్‌బాల్ క్రీడాకారుల రాకతో జెడ్పీ హైస్కూల్‌లో పండుగ వాతావరణం కనిపించింది. మూడు రోజుల పాటు జెడ్పీ హైస్కూల్‌లో జరిగే అంతరజిల్లా ఫుట్‌బాల్(అండర్ 19 బాలురు, బాలికల) పోటీలను ఎమ్మెల్యే నవాజ్‌బాషా శనివారం ప్రారంభించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ జయరామయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత ఎమ్మెల్యే జెండా ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాకారుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. ఫుట్‌బాల్ కోర్టులో స్వయంగా బాల్‌ను కాలుతో తన్ని గోల్ వేసి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ అంతరజిల్లా ఫుట్‌బాల్ క్రీడాపోటీలకు మదనపల్లె వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన క్రీడాకారులు ఫుట్‌బాల్ క్రీడలో ఉత్తమ ప్రతిభ కనపరిచాలన్నారు. గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తి కనబరచాలని పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీ జయరామయ్య మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలో క్రీడాభిమానులకు పండగ రోజని, ఈ ఏడాది అండర్-19 ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ అంతరజిల్లాల పోటీలు రెండూ ఇక్కడే నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెమ్మ, వెలుగుచంద్ర, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఎంఈఓ ప్రభాకరరెడ్డి, రాజగోపాల్, మున్సిపల్ వైస్‌చైర్మన్ నూర్‌ఆజం, వైఎస్సార్‌సీపీ నాయకులు నారదరెడ్డి, ఎన్.ఇర్ఫాన్‌ఖాన్, గుండ్లూరుఫీ, తట్టిశ్రీనివాసులురెడ్డి, గౌడసాని వెంకటరమణ, కత్తిరాజు, బాలగంగాధరరెడ్డి, పీడీలు అన్సర్‌బాషా, రాము, కిశోర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీలు

67వ ఎస్‌జీఎఫ్ అంతర జిల్లాల ఫుట్‌బాల్ పోటీల్లో మొదటి రోజైన శనివారం హోరాహోరీగా పోటీలు జరిగాయి. అండర్-19 బాలుర విభాగంలో చిత్తూరు, ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో చిత్తూరు 3 గోల్స్, గుంటూరు, శ్రీకాకుళం మధ్య జరిగిన పోటీల్లో గుంటూరు 8 గోల్స్ చేశాయి. కృష్ణ, విజయనగరం మధ్య జరిగిన పోటీల్లో ఇరుజట్లు టైగా నిలిచాయి. విశాఖపట్నం, పశ్చిమగోదావరి మధ్య జరిగిన పోటీల్లో 2 గోల్స్‌తో విశాఖజట్టు విజయం సాధించింది. బాలికల విభాగంలో విశాఖపట్నం-పశ్చిమగోదావరి మధ్య జరిగిన పోటీల్లో 2-2 ఫలితాలతో టై, గుంటూరు, విజయనగరం మధ్య గుంటూరు 4 గోల్స్, శ్రీకాకుళం-వైఎస్సార్ కడప మధ్య పోటీల్లో శ్రీకాకుళం వాక్‌ఓవర్ కాగా, కృష్ణ, చిత్తూరు మధ్య పోటీల్లో టై, ప్రకాశం, వెస్ట్‌గోదావరి మధ్య జరిగిన పోటీల్లో ప్రకాశం 2 గోల్స్‌తో విజేతగా నిలిచింది.

బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



అండర్-14 బాస్కెట్‌బాల్ జిల్లా బాలుర జట్టు

మదనపల్లె సిటీ : ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-14 బాస్కెట్‌బాల్ బాల,బాలికల జట్ల ఎంపిక శనివారం స్థానిక బీటీ కాలేజీ మైదానంలో జరిగింది. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వసంత తెలిపారు. రాజోలులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు వీరు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ అజీమ్, పీడీలు నాగరాజ, మెయినుద్దీన్, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ నటరాజ, మహమూద్, జయక్రిస్టి, ఉష పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప-కృష్ణాపురం రైల్వే మార్గంలోని ఎగువ రైలు పట్టాలపై టంగుటూరి సందీప్ (27) అనే యువకుడి మృతదేహం లభ్యమైనట్లు రైల్వే ఎస్‌ఐ శ్రీనివాస వర్మ తెలిపారు. చెన్నూరు మండలం కొండపేట గ్రామానికి చెందిన టంగుటూరి సందీప్ కడప నగరంలోని ఓ ప్రైవేటు చిన్న పిల్లల ఆస్పత్రిలో పని చేస్తుండే వాడన్నారు. శనివారం సాయంత్రం చెన్నై-ముంబయి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. కారణాలు తెలియరాలేదని పేర్కొన్నారు.

బార్ అసోసియేషన్ ఫలితాలు వెల్లడించాలి



మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది శరత్‌కుమార్‌రాజు

రాజంపేట : రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికల నేపథ్యంలో 23 మంది న్యాయవాదుల ఓటు హక్కుకు సంబంధించి హైకోర్టులో దాఖలు చేసిన రిట్‌పిటిషన్‌ను ఉపసంహరించుకున్నామని, ఎన్నికల అధికారికి ఆగస్టు 19న కడప కోర్టు లెక్కించిన ఫలితాలను, అధికారికంగా ప్రకటించాలని నోటీసు ద్వారా కోరామని సీనియర్ వైఎస్సార్‌సీపీ నేత, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొండూరు శతర్‌కుమార్ రాజు వెల్లడించారు. శనివారం బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాజంపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు మార్చి 31న జరిగాయన్నారు. గతంలోని పాలకవర్గం అర్హుల అయిన 23 మంది న్యాయవాదులను అనర్హులుగా చేసి ఓటు హక్కు లేకుండా చేశారన్నారు. దీనిని ప్రతిఘటిస్తూ న్యాయవాదులు హైకోర్టులో రిట్‌పిటిషన్ దాఖాలు చేశామన్నారు. దీంతో హైకోర్టు వీరికి ఓటు హక్కు కలిగిస్తూ, ఫలితాలు మాత్రం వెలువరించవద్దని తాత్కాలిక ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఇందులో భాగంగా ఆగస్టు 19న ఓట్ల లెక్కింపునకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అదే విధంగా ఫలితాలు వెలువరించవద్దన్నారు. ఈ ఫలితాల్లో అధ్యక్షునిగా పోటీ చేసిన కె.సురేంద్రబాబుకు.. తొలిగించిన ఓట్లు కాకుండానే 99 ఓట్లలో 8 ఓట్ల మెజారిటీ వచ్చిందని తెలిసిందన్నారు. సెక్రటరీగా పోటీ చేసిన సయ్యద్ జాఫర్‌బాషా తొలగించిన ఓట్లు కలిపితే 19 ఓట్ల మెజారిటీతో, సెక్రటరీగా పోటీ చేసిన సుందరామరాజుకు తొలిగించిన ఓట్లతో కలిపితే 14 ఓట్ల మెజార్టీ ఉండినట్లేనని తెలిసిందన్నారు. ఇటువంటి పరిస్థితిలో హైకోర్టు పూర్తి చేయుటకు చాలా కాలం పడుతున్నందు వల్ల న్యాయవాదులు వేసిన రిట్‌పిటిషన్ వెనక్కి తీసుకోవడం జరిగిందన్నారు. కోర్టులో రిట్‌పిటిషన్ పెండింగ్‌లో లేనందున ఎన్నికల అధికారికి ఫలితాలను వెలువరించుటకు ఎలాంటి అడ్డంకులు లేవన్నారు. బార్ ఎన్నికలు సంబంధించి వాజ్యాలు లేవన్నారు. సమావేశంలో సురేంద్రబాబు, నలికిరిరెడ్డయ్య, జానీ, జల్లినారాయణ, నాగప్రసాద్, చంద్రమోహన్‌రెడ్డి, రవి, నాగేశ్వరరావు, జాఫర్‌బాషా పాల్గొన్నారు.

ప్రజల ఆర్థికాభివృద్ధికి సహకారం



మెగా చెక్కును అందజేస్తున్న ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్

రాజంపేట టౌన్ : అన్ని వర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధికి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు విరివిగా రుణాలు ఇచ్చి సహకరిస్తుందని ఆ బ్యాంక్ చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. పట్టణంలోని టీఎస్‌ఆర్ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన రుణ విస్తరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ వివిధ వర్గాల వారికి మంజూరైన రుణాలకు సంబంధించిన రూ.6.80 కోట్ల విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరైనా వ్యాపార రంగంలో అడుగు పెట్టాలంటే వారికి డబ్బులు ఎంతో అవసరమన్నారు. అలాంటి వారికి తమ బ్యాంకు రుణాలు ఇచ్చి ప్రోత్సహిస్తుందన్నారు. వ్యాపారరంగాన్ని ఎంచుకునే ముందు ఆ వ్యాపారం గురించి పూర్తిస్థాయిలో అవగాహన కలిగి వుండాలన్నారు. తొలుత ఆటుపోట్లు ఎదురైనా వెనకడుగు వేయకుండా మెల్లగా ఎంచుకున్న వ్యాపారంలోనే రాణించేందుకు కృషి చేస్తే విజయం సాధిస్తారని తెలిపారు. అలాగే బ్యాంకుల్లో తీసుకునే రుణాలను క్రమం తప్పకుండా చెల్లిస్తే తాము ఎంత పెద్ద మొత్తంలో అయినా రుణాలు ఇచ్చి వ్యాపారాన్ని విస్తరించుకునేందుకు సహకరిస్తామని పేర్కొన్నారు. గృహ, విద్యా రుణాలకు ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజు లేకుండానే రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. తమ బ్యాంకులో డిపాజిట్ చేసుకునే వారికి ఆకర్షణీయమైన వడ్డీ ఇస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఇంటిలోనే కూర్చొని ఆన్‌లైన్‌లోనే బ్యాంకుకు సంబంధించి అన్ని లావాదేవీలు కొనసాగించుకునే సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం వెంకటేశ్వర్‌రెడ్డి, నాబార్డు డీడీఎం విజయ్‌విహారి, ఆర్‌ఎం సుశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

కేసులపై సత్వరమే స్పందించండి



రామసముద్రం పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ కృష్ణారావు

రామసముద్రం : కేసులపై సత్వరమే స్పందించాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు తెలిపారు. శనివారం ఆయన రామసముద్రం పోలీస్‌స్టేషన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. మండలంలో నేరాల నియంత్రణకు పోలీస్ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అంతేకాకుండా దీర్ఘకాలిక కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. కర్ణాటక నుంచి వచ్చే అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణా, పేకాట స్థావరాలపై నిఘా పెట్టాలన్నారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లు కదలికపై నిఘా పెంచి, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. మండల, గ్రామ స్థితిగతులు, సమస్యాత్మక గ్రామాలపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కేశవప్ప, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్ ద్వారా రూ.9.50 కోట్ల ఆదాయం



గిరిధర్‌రెడ్డి

బి.కొత్తకోట : మూడేళ్లలో హార్సిలీహిల్స్ టూరిజం యూనిట్ ద్వారా పర్యాటకశాఖకు రూ.9.50 కోట్ల ఆదాయం లభించిందని ఆ శాఖ తిరుపతి డివిజనల్ మేనేజర్ మడితాటి గిరిధర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌పై తనిఖీలు నిర్వహించారు. రెస్టారెంట్‌లో సందర్శకులకు అందిస్తున్న భోజనం రుచి చూశారు. అక్కడే సందర్శకులతో ముచ్చటించి అతిథి గృహాల సేవలు, రెస్టారెంట్‌లో అందిస్తున్న భోజనం, అల్పాహారం నాణ్యతపై ఆరా తీశారు. దీనిపై సందర్శకులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతి డివిజన్‌లో పర్యాటకశాఖకు సంబంధించి రవాణా విభాగం తర్వాత అత్యధిక ఆదాయం లభిస్తున్నది హార్సిలీహిల్స్ యూనిట్ నుంచే అని చెప్పారు. దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. 2020-21లో రూ.2,40,84,317, 2021-22లో రూ.3,22,90,459, 2022-23లో రూ.3,87,12,249 కలుపుకొని మూడేళ్లలో రూ.9,50,87,025 ఆదాయం వచ్చిందన్నారు. ఇక్కడి అతిథులకు అత్యున్నత సేవలు అందించడం కోసం అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపామని చెప్పారు. అతిథి గృహాల సుందరీకరణ, మరమ్మతులకు రూ.3 కోట్లు కేటాయించాలని నివేదించామన్నారు. కార్యక్రమంలో యూనిట్ మేనేజర్ నేదురుమల్లి సాల్వీన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలు మృతి



మదనపల్లె : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో శనివారం గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందింది. గత కొంత కాలంగా ఆస్పత్రి ఆవరణలోని క్యాంటీన్ సమీపంలో ఆమె ఉంటోంది. అనారోగ్యానికి ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటోంది. భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆస్పత్రిలో సిబ్బందితోపాటు ఆస్పత్రికి వచ్చే రోగులు ఆమెకు భోజనం అందించేవారు. శనివారం ఆమె ఉంటున్న ప్రాంతం నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు వెళ్లి చూశారు. వృద్ధురాలు స్పృహలేకుండా పడి ఉండటంతో ఆస్పత్రి వైద్యులకు సమాచారం అందించారు. దీంతో ఆస్పత్రి వైద్యురాలు వచ్చి ఆమెను పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు. వృద్ధురాలి బంధువులు ఎవరైనా ఉంటే మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించుకోవాలని ఆస్పత్రి అధికారులు, టూటౌన్ పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఐదు గేదెలు మృత్యువాత



పొలంలో మృతి చెందిన గేదెలు

నందలూరు (రాజంపేట) : మండల పరిధిలోని కుందానెల్లూరు గ్రామంలో విద్యుత్ షాక్‌తో ఐదు గేదెలు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామంలోని ఒక పొలంలో పంట నష్టం జరగకుండా, జంతువులు ప్రవేశించకుండా ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె తగిలి.. ఐదు గేదెలు మృతి చెందాయని గేదెల యజమానులు తుంటి సుబ్బరాయుడు, తుంటి ఎల్లయ్య తెలిపారు. ఆ గేదెలన్నీ సూటివి కావడంతో భారీ నష్టం వాటిల్లిందని వారు వాపోయారు.

ఆస్తి కోసం తండ్రిపై కొడుకు దాడి

- పరిస్థితి విషమం
- కేసు నమోదు



తీవ్రంగా గాయపడిన వెంకటరమణ

ములకలచెరువు : ఆస్తి కోసం కన్న కొడుకే తండ్రిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన శనివారం అర్ధరాత్రి మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ గాయత్రి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామాపురానికి చెందిన వెంకటరమణ (63)కు రెండు పెళ్లిళ్లు జరిగాయి. మొదటి భార్య అనారోగ్యంతో మృతి చెందడంతో రెండో పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్యకు ఒక కుమారుడు కరుణాకర్. రెండో భార్య శ్యామలమ్మకు సంతానం లేరు. ప్రస్తుతం వారు ఉంటున్న ఇంటిని తన పేరు మీద రాసివ్వాలని కరుణాకర్ కొన్నేళ్లుగా వేధిస్తున్నాడు. తన ప్రాణం ఉన్నంత వరకు రాసిచ్చేది లేదని వెంకటరమణ తేల్చి చెప్పడంతో.. ఆగ్రహించిన కరుణాకర్ (45) కర్రతో తలపైన దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. పక్కనే ఉన్న శ్యామలమ్మ అడ్డుకోవడంతో ఆమె పైనా దాడి చేసి పరారయ్యాడు. వారి కేకలు విని చుట్టు పక్కల వారు వచ్చారు. తీవ్రంగా గాయపడిన వెంకటరమణను 108 సాయంతో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు రామాపురం చేరుకొని విచారణ చేశారు. శ్యామలమ్మ ఫిర్యాదు మేరకు కరుణాకర్‌పై వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చెలరేగిన చిత్తూరు బ్యాట్స్‌మెన్



ఆశిష్‌రెడ్డి, చిత్తూరు, (202 పరుగులు)



ధరణికుమార్‌నాయుడు, చిత్తూరు, (120 పరుగులు)



మహేంద్రారెడ్డి, అనంతపురం (101 పరుగులు)



ఆదిల్ హుస్సేన్, కడప, (5 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా నిర్వహిస్తున్న మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతున్నాయి. శనివారం కడపలోని కేఓఆర్‌ఎం క్రీడా మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, కర్నూలు జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 285 పరుగుల భారీ స్కోరు చేసింది. జట్టులోని జి.ఎస్.ఆశిష్ రెడ్డి 187 బంతుల్లో 202 పరుగులతో డబుల్ సెంచరీ నమోదు చేశాడు. ఈయనకు జతగా ఇ.ధరణి కుమార్‌నాయుడు 117 బంతుల్లో 120 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ సాత్విక్ 3 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో..

కడప నగరంలోని కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మరోమ్యాచ్‌లో అనంతపురం, కడప జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 77 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని మహేంద్రారెడ్డి 101 పరుగులు చేశాడు. కడప బౌలర్ ఆదిల్ హుస్సేన్ 5 వికెట్లు, అస్లాం 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 51 పరుగులు చేసింది. జట్టులోని వంశీకృష్ణ 23, వాసుదేవరాజు 23 పరుగులతో క్రీజులో ఉన్నారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.